నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శనివారం 23 మార్చి 2024 | KARIMNAGAR

ఆశీర్వదిస్తే.. మరింత అభివృద్ధి చేస్తా

కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా నిధులు తీసుకొస్తా • బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్: ఎస్సారార్ కళాశాల మైదానంలో బ్యాటింగ్ చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 22 : తనను ఆశీర్వదించి కరీంనగర్ ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. తనకు అవకాశమిస్తే ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకగా నిలుస్తానని చెప్పారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసే దమ్ము తనకు ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం నగరంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో కలిసి మార్నింగ్ వాక్ చేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను 2019లో ఎంపీగా ఓడినా కరీంనగర్ ప్రజలకు అందుబాటులో ఉన్నానని తెలిపారు. కానీ, ఎంపీగా గెలిచిన బండి సంజయ్ మాత్రం నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో లేడని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా ఆయన నియోజకవర్గ అభివృద్ధి కోసం నయాపైసా తేలేదని మండిపడ్డారు. పార్లమెంట్‌లో ప్రశ్నించేందుకు తాను ఎంపీగా ఉంటేనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు రూ.వెయ్యి కోట్లతో స్మార్ట్‌సిటీ తీసుకొచ్చానని, కొత్తపల్లి నుంచి మనోహరాబాద్ వరకు రైల్వే లైన్ మంజూరు చేయించి పనులు ప్రారంభించేలా చేశామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ట్రిపుల్‌ఐటీతో పాటు పరిశ్రమలను తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. బండి సంజయ్ ఎంత సేపూ రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడం తప్ప చేసిందేమీ లేదని, నిబంధనల ప్రకారం కేంద్రం నుంచి వస్తున్న నిధులను తాను తీసుకువచ్చానని చెప్పుకోవడం బండి సంజయ్‌కే చెల్లిందన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఒక్కసారి ఆలోచించి బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, కార్పొరేటర్లు బండారి వేణు, సతీశ్, బీఆర్ఎస్ నాయకులు జక్కుల నాగరాజు యాదవ్, దూలం సంపత్, సాయి, వెంకట్, శేఖర్‌రావు, తిరుపతిరెడ్డి, ఆనంద్, సూరి, అనిల్, సాయికృష్ణ పాల్గొన్నారు.

కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

ఒకే రోజు రూ.86 లక్షల వసూళ్లు

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 22 : ప్రభుత్వ సంస్థల నుంచి రావాల్సిన మొండి బకాయిల వసూళ్లపై నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం ఒక్క రోజే రూ.86 లక్షల ఆస్తి పన్ను వసూలు చేశారు. ఆర్టీసీ వర్క్‌షాపునకు సంబంధించి 2014 నుంచి ఆస్తి పన్ను రూ.1,80,76,591 బకాయి ఉండగా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆర్టీసీ అధికారులతో మాట్లాడి చెల్లింపు విషయంలో ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అందించిన వడ్డీ మాఫీ పథకాన్ని పరిగణలోకి తీసుకొని ఆర్టీసీ అధికారులు రూ.86,07,972 చెక్కు అందించారు. కాగా, వివిధ ప్రభుత్వ సంస్థల కార్యాలయాల నుంచి రూ.22 కోట్ల బకాయిలు రావాల్సి ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.50 కోట్లకు పైగా వసూలు చేశారు.

మొండి బకాయిదారులకు నోటీసు

నగరపాలక సంస్థకు ఏళ్ల తరబడి ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిల వసూళ్ల విషయంలో కమిషనర్, డిప్యూటీ కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. శుక్రవారం గురుద్వారాకు సంబంధించి వాణిజ్య దుకాణాల యజమానులకు నోటీసులు అందించారు. తక్షణమే ఆస్తి పన్ను చెల్లించాలని, లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరితోపాటు వివిధ వ్యాపార సంస్థలకు అధికారులు నోటీసులు ఇచ్చారు.

ఎండుతున్న మక్క.. ట్యాంకర్ నీరే దిక్కు..

కాల్వశ్రీరాంపూర్, మార్చి 22: బావులు ఎండడం..భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలను కాపాడేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఊషన్నపల్లెకు చెందిన చందిన ముస్కు అనంతరెడ్డి ఎకరం భూమిలో మక్క సాగు చేశాడు. వ్యవసాయ బావి ఎండిపోవడంతో కంకి విడిచే దశలో నీరందక మక్క చేను వడలిపోయింది. దీంతో అనంతరెడ్డి ట్యాంకర్ ద్వారా నీరందిస్తూ అరిగోసపడుతున్నాడు. వారానికోసారి రూ. 4 వేలు వెచ్చించి ట్యాంకర్ ద్వారా నీళ్లు పెడుతున్నామని చెప్పాడు. అయినా పంట చేతికందడం కష్టమేనని, పెట్టిన పెట్టుబడి కూడా రాదేమోని ఆవేదన వ్యక్తం చేశాడు.

కరీం'నగరం'లో ఆటో షో నేడే

- 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో నిర్వహణ
- సర్కస్ గ్రౌండ్ వేదికగా రెండు రోజుల ఎక్స్‌పో
- ఒకే వేదికపైకి ప్రముఖ కార్లు, ద్విచక్ర వాహనాల కంపెనీలు
- వాటితోపాటే బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు
- సందర్శకులకు ఉచిత ప్రవేశం

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 22 : అత్యాధునిక ఫీచర్స్‌తో ఉన్న ప్రముఖ కంపెనీల కార్లు, ద్విచక్ర వాహనాల కోసం ఎదురుచూస్తున్నారా..? ఒకే దగ్గర వాటి వివరాలు తెలుసుకోవాలనుకుంటున్నారా.. కరీంనగర్‌లో షోరూంలు లేవు, ఎలా అని ఆలోచిస్తున్నారా..? అయితే, మీలాంటి వారి కోసమే 'నమస్తే తెలంగాణ' 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో కరీంనగర్‌లో మెగా ఆటో షో నిర్వహిస్తున్నారు. మహాత్మా జ్యోతిబా పూలే మైదానం (సర్కస్ గ్రౌండ్) వేదికగా శని, ఆదివారాల్లో నిర్వహించే ఈ ఎక్స్‌పోను నేటి ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. సందర్శకులకు ఉచిత ప్రవేశం కల్పించిన ఈ షోలో ప్రముఖ కార్లు, ద్విచక్ర వాహనాల కంపెనీలతోపాటు రుణాలు అందించే బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు పాల్గొంటున్నాయి. మొదటిసారిగా ప్రపంచ స్థాయిలో కార్ల కంపెనీలు ఈ షోలో భాగస్వామ్యమవుతున్నాయి. ఒకే వేదికపై తమ సరికొత్త మోడళ్లను ప్రదర్శించనున్నాయి. ఇప్పటి వరకు నగరంలో షోరూంలు లేని మెర్సిడిస్ బెంజ్, ఆడి, వోల్వో, కార్లతోపాటు టయోటా కంపెనీలు కూడా తమ స్టాళ్లలో వాహనాల ఫీచర్స్‌ను వివరించనున్నాయి. సుమారు 20కి పైగా కార్ల కంపెనీలతోపాటు బైక్‌లు, ఎలక్ట్రిక్ వాహన కంపెనీలు కూడా తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయి. దీంతో సందర్శకులు ఒకే చోట వాహనాలకు సంబంధించిన సమస్త సమాచారం తెలుసుకునే అవకాశం ఏర్పడింది. ఈ షోకు మెయిన్ స్పాన్సర్ ఆదర్శ ఆటో మోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అసోసియేట్ స్పాన్సర్లుగా మహవీర్ గ్రూప్ మెర్సిడిస్ బెంజ్, ఆడి హైదరాబాద్, వోల్వో, మహవీర్ ఐసుజు, ప్రైడ్ జీప్, గ్రీన్ హోండా, మోటార్ లైన్ మహీంద్ర డీలర్, క్వాంటం ఈ-స్కూటర్స్, కాకతీయ టయోటా, మారుతి సుజుకి, నెక్సా, మారుతి సుజుకి ఎరీన, ఆదర్శ ట్రూ వాల్యూ, మాలిక్ కియా, హైరా సుజుకి సంస్థలతోపాటు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇతర సంస్థలు పాల్గొంటున్నాయి.

మహాత్మా జ్యోతిబాపూలే మైదానంలో సిద్ధమవుతున్న స్టాళ్లు

కొండగట్టు లీజుల గోల్‌మాల్‌లో మరో ఉద్యోగికి మెమో

మల్యాల, మార్చి 22 : కొండగట్టు అంజన్న సన్నిధిలో పద్దు పుస్తకాలను పరిశీలించిన దేవాదాయ శాఖ అధికారులు కొరడా ఝుళిపించడం ప్రారంభించగా, తాజాగా శుక్రవారం మరొకరికి మెమో జారీ చేశారు. అంజన్న ఆలయంలో పనిచేస్తున్న ఓ పర్యవేక్షకుడికి, సీనియర్ అసిస్టెంట్‌కు గురువారం మెమోలు జారీ చేసిన విషయం తెలిసిందే. రికార్డుల పర్యవేక్షణ సరిగా లేనందున విధుల్లో అలసత్వంగా వ్యవహరించినందుకు గతంలో ఆలయ పరిధిలో ఏఈవోగా పనిచేసి ఇటీవలే కొమురవెల్లికి బదిలీపై వెళ్లిన ఉద్యోగికి తాజాగా మెమో జారీ చేశారు. కొండగట్టు ఈవో టంకశాల వెంకటేశం జారీ చేసిన మెమోను కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం ఈవోకు మెయిల్ ద్వారా పంపారు. సదరు ఏఈవోకు అందజేసి 48 గంటలలోపు వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆలయ ఈవో వెంకటేశం మెమోలో పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, మార్చి 22: మండల కేంద్రంలోని ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 15 నుంచి 'ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ' అలాగే 'సీసీటీవీ ఇన్స్టాలేషన్ అండ్ సర్వీసింగ్' కోర్సుల్లో శిక్షణ ప్రారంభమవుతున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, పని ముట్లు, శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం అందిస్తామని తెలిపారు. 18-45 సంవత్సరాలున్న ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పదో తరగతి మెమో జిరాక్స్, ఐదు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9949448157, 9849411002 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కలెక్టరేట్, మార్చి 22: షెడ్యూల్ కులాలకు చెందిన డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు నతానియేల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లోని ఎస్సీ అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనుండగా, ఔత్సాహిక అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోగా వెబ్‌సైట్ www.tsstudycircle.co.inలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. టెట్, బీఈడీ, డైట్‌లో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు.

వాహన టెండర్లలో 'బంధు'ప్రీతి!

- ట్రాన్స్‌కో ఉద్యోగుల బంధువులకే ప్రాధాన్యత
- నిబంధనలకు వ్యతిరేకంగా అగ్రిమెంట్
- టీఎస్ ట్రాన్స్‌కో టెండర్లపై అనుమానాలు
- నిరుద్యోగుల పొట్టకొడుతున్న అధికారులు
- రద్దు చేయాలంటున్న అద్దె వాహన యజమానులు

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీఎస్ ట్రాన్స్‌కో)లో అద్దె వాహనాల టెండర్లలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు 'బంధు'ప్రీతి కనబర్చుతున్నట్లు తెలుస్తోంది. బినామీ పేర్లతో అద్దె వాహనాలను సమకూర్చుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారులు వారితో అగ్రిమెంట్లు చేసుకుంటున్నారు. ఇటీవల టీఎస్ ట్రాన్స్‌కోలో నిర్వహించిన టెండర్లలో ఇప్పటికే ఒక చోట అద్దెకు నడుస్తున్న వాహనానికి మరో చోట లీజ్ అగ్రిమెంట్ చేసుకోవడం నిబంధనలకు నీళ్లు వదిలారనడానికి నిదర్శనం. అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో అద్దె వాహనాలపై ఆధారపడి జీవిస్తున్న నిరుద్యోగులకు ఉపాధి లేకుండా పోతున్నది. ఈ టెండర్లను రద్దు చేయాలనే డిమాండ్ సర్వత్రా వినిస్తోంది.

కరీంనగర్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : టీఎస్ ట్రాన్స్‌కో పరిధిలోని టెలికాం సర్కిల్ పరిధిలో ఇటీవల ఐదు అద్దె వాహనాల కోసం టెండర్లు పిలిచారు. అందులో కరీంనగర్ ఎస్ఈ కార్యాలయానికి ఒకటి, డీఈ కార్యాలయానికి మరొకటి, కామారెడ్డి జిల్లా డిచ్‌పల్లి, నిజామాబాద్, రామగుండం ఏడీఈ కార్యాలయాల్లో ఒక్కో వాహనానికి టెండర్లు పిలిచారు. ఈ నెల 7 వరకు టెండర్లు ఆహ్వానించి అదే రోజు తెరిచారు. అయితే, అందులో అవకతవకలు జరిగాయని అద్దె వాహన యజమానులు ఆరోపిస్తున్నారు. టెండర్లు దాఖలు చేసే విధానంలోనే అధికారులు నిబంధనలు పాటించలేదని వాపోతున్నారు. నిబంధనల ప్రకారం ఏ చిన్న టెండర్ జరిగినా సీల్ చేసిన బాక్స్‌లు ఏర్పాటు చేయాలి. ఇలా చేస్తేనే టెండర్ పత్రాలకు భద్రత ఉంటుంది. కానీ, ఇక్కడ ఎలాంటి బాక్స్‌లు ఏర్పాటు చేయకుండా కరీంనగర్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయంలో టెండర్ షెడ్యూళ్లను స్వీకరించి, ఓ అధికారి చేతికి ఇవ్వగా ఆయన తన టేబుల్ డ్రాలో వేసుకోవడం అనుమానాలకు తావిస్తున్నది. సీల్ చేసిన బాక్స్ ఏర్పాటు చేయనట్లయితే టెండర్లు ఓపెన్ చేసి చూసే ప్రమాదం ఉంటుందని, ఇక్కడ ఇదే జరిగి ఉంటుందని అద్దె వాహనదారులు ఆరోపిస్తున్నారు. బినామీ పేర్లతో టెండర్లు దాఖలు చేసిన సంస్థ ఉద్యోగికి సంబంధించిన వ్యక్తికి రెండు చోట్లా టెండర్లు దక్కడం అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నది.

బినామీ పేరుతో సంస్థ ఉద్యోగికే టెండర్లు

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో అద్దె వాహనాల విధానాన్ని అమలు చేస్తున్నారు. అయితే, ఈ వాహనాల టెండర్లలో ఆయా సంస్థలు, శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొనరాదన్న నిబంధనలు ఉన్నాయి. టీఎస్ ట్రాన్స్‌కోలో మాత్రం ఉద్యోగులే బినామీల పేరిట టెండర్లు దాఖలు చేసి నిబంధనలకు విరుద్ధంగా అద్దె వాహనాలను సమకూర్చుతున్నారు. అధికారులు పూర్తి స్థాయిలో వీరికి సహకరించడం వల్లే ఇది సాధ్యమవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రామగుండం డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఒక ఉద్యోగికి కరీంనగర్ ఎస్ఈ, రామగుండం డివిజన్ కార్యాలయాల్లో అద్దె వాహనాలను సమకూర్చేందుకు టెండర్లు వేశాడు. అధికారుల అండ ఉండడంతో నిబంధన ప్రకారం లేకున్నా వీటిని ఆయన దక్కించుకున్నాడు. అయితే, ఈ టెండర్లు దక్కించుకున్న సంస్థ ఉద్యోగికి అసలు వాహనాలే లేవని తెలుస్తున్నది. ఎస్ఈ కార్యాలయానికి సమకూర్చాల్సిన కారు ఇప్పటికే రామగుండంలోని ఓఅండ్ఎం డీఈ కార్యాలయంలో నడుస్తున్న (టీఎస్ 27 టీ 6542) వాహనాన్ని ఎస్ఈ కార్యాలయంలో సమకూర్చేందుకు కోడ్ చేసినట్లు, అసలు కారు యజమానికి తెలియకుండానే ఇదంతా జరిగినట్లు తెలుస్తున్నది. కారు యజమాని పేరు మీదనే లీజు అగ్రిమెంట్ కూడా జరిగినట్లు సమాచారం. టెండర్ నిబంధనల ప్రకారం రెండేళ్లు ఏదైనా సంస్థలో వాహనాన్ని అద్దెకు నడిపిన అనుభవం ఉండాలి. ఇవేవీ చూడని అధికారులు తమ సంస్థ ఉద్యోగి అనే ఒకే ఒక కారణంతో రెండు వాహనాలను ఒకరికే అగ్రిమెంట్ చేసినట్లు తెలుస్తున్నది. రామగుండం ఓఅండ్ఎం డీఈ కార్యాలయంలో మరో ఏడాది గడువు ఉన్న వాహనాన్ని ఎస్ఈ కార్యాలయానికి అద్దెకు ఇస్తున్నట్లు పేర్కొనడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. ఒక వేళ ఇది జరగాలంటే పాత అగ్రిమెంట్ రద్దు చేసుకోవాలి. అదేమీ లేకుండానే ఈ వాహన నంబర్‌తో అగ్రిమెంట్ చేసుకోవడం టీఎస్ ట్రాన్స్‌కో అధికారులకే చెల్లింది. తన వాహనం నంబర్‌తో అగ్రిమెంట్ ఎలా జరిగిందో తనకు తెలియదని మరో పక్క సదరు వాహన యజమాని కూడా ఆశ్చర్యపోతున్నాడు. తాను ఎవరికీ తన వాహన పత్రాలు ఇవ్వ లేదని కూడా చెబుతుండడం గమనార్హం. అంతే కాకుడా, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని ఆయన స్పష్టం చేశారు. సంస్థలో 30కి పైగా అద్దె వాహనాలు ఉండగా, అందులో ఏడుకు పైగా వాహనాలు సంస్థ ఉద్యోగులే బినామీల పేరిట నడిపిస్తున్నారని తెలుస్తున్నది.

మండిపడుతున్న నిరుద్యోగులు

నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో పలు ప్రభుత్వ శాఖలు, సంస్థలు ఈ విధంగా అద్దె వాహనాల విధానాన్ని అమలు చేస్తున్నాయి. అయితే, సంస్థలో ఉద్యోగులే వీటిని బినామీ పేర్లతో కాజేస్తే తమ పరిస్థితి ఏమిటని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదిహేను ఏండ్లుగా అద్దె వాహనాలు నడిపించుకుని బతుకుతున్న తామంతా రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆందోళనకు చెందుతున్నారు. టీఎస్ ట్రాన్స్‌కోలో మాదిరిగానే అనేక సంస్థల్లో ఇదే విధంగా కొందరు ఉద్యోగులు తమ బంధువులు, స్నేహితుల పేర్లతో వాహనాలు నడిపించుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. టీఎస్ ట్రాన్స్‌కోలో ఇటీవల జరిగిన ఈ టెండర్లపై అనుమానాలు ఉన్నాయని, ఒకే వ్యక్తికి రెండు చోట్ల వాహనాలు రావడానికి అధికారులే సహకరించి ఉంటారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ టెండర్లను వెంటనే రద్దు చేసి నిరుద్యోగులమైన తమకు న్యాయం చేయాలని అద్దె వాహన యజమానులు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమించ లేదు

అద్దె వాహనాల టెండర్లలో నిబంధనలు అతిక్రమించ లేదు. ఏ టెండర్‌లో తక్కువ కోడ్ చేస్తే దానినే ఆమోదించడం జరుగుతుంది. మేం అదే చేశాం. ఈ టెండర్లు బినామీల పేరుతో వేశారని మాకెలా తెలుస్తుంది? అవి బినామీ టెండర్లని తెలుసుకోవడం మా పని కాదు కదా. రామగుండంలో డీఈ ఆఫీసులో వాహనం ఇక్కడ (కరీంనగర్) రిజిస్టర్ చేశారనే విషయం నాకు తెలియదు. అలాంటిది ఏమైనా ఉంటే వేరే వాహనాన్ని ఏర్పాటు చేసుకుంటారు. అందులో ఇబ్బంది ఏమీ ఉండదు. మా సంస్థలో పనిచేసే ఉద్యోగులు టెండర్ వేశారనే విషయాన్ని మేం పట్టించుకోం. టెండర్లు వచ్చాయా..? లేదా చూసుకుని, లీస్ట్ వచ్చిన టెండర్లనే ఫైనలైజ్ చేస్తాం. మా పని అంత వరకే. నేను ఇటీవలే వచ్చా. ఇక్కడ వాహన యజమానుల మధ్య గొడవలు ఉండొచ్చు. ఇవన్నీ నాకు తెలియదు.

- నాగేంద్రరావు, టీఎస్ ట్రాన్స్‌కో ఎస్ఈ (టెలికాం)

కాల్వశ్రీరాంపూర్: మాట్లాడుతున్న మాజీ మంత్రి, పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

సాగునీరివ్వడంలో విఫలం

- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

కాల్వశ్రీరాంపూర్, మార్చి 22: యాసంగి పంటలకు సాగునీరివ్వడంలో రేవంత్ సర్కారు విఫలమైందని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క గుంట ఎండిపోకుండా నీరందించామని గుర్తు చేశారు. మోసపూరిత గ్యారెంటీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాల్వశ్రీరాంపూర్, ఓదెల, ఎలిగేడు, జూలపల్లిలో శుక్రవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఆయాచోట్ల జడ్పీ చైర్మన్ పుట్టమధు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాట్లాడారు. కష్టపడి పనిచేసి పెద్దపల్లి గడ్డపై గులాబీ జెండాను రెపరెపలాడించాలని శ్రేణులకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కుంగిపోవద్దని, ప్రజాసమస్యలపై పోరాడాలని నిర్దేశించారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలు దగా పడ్డాయన్నారు. రైతుబంధును నిలిపివేసిందని, కల్యాణలక్ష్మిని ఆపేసిందని విమర్శించారు. పింఛన్లు పెంచలేదు, మహాలక్ష్మి స్కీం ఊసేలేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్‌ది కుటుంబ పాలన అని విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి టికెట్లు ఎందుకిచ్చారో చెప్పాలని నిలదీశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కాగా, మీటింగ్‌లో కార్యకర్తలు కొప్పుల, దాసరిని ఘనంగా సత్కరించారు. కాల్వశ్రీరాంపూర్‌లో ఎంపీపీ నూనేటి సంపత్, కూనారం పీఏసీఎస్ చైర్మన్ గజవెల్లి పురుషోత్తం, నాయకులు కొట్టె రవీందర్, నిదానపురం దేవయ్య, కరుణాకర్‌రావు పాల్గొన్నారు.

మళ్లీ ఎండలు..

రెండు, మూడు రోజుల కిందటి వరకు తుఫానుతో వాతావరణం చల్లగా ఉండగా, గురు, శుక్రవారాల్లో భానుడు ఒక్కసారిగా భగ్గుమన్నాడు. మార్చి నెలలోనే దంచి కొడుతున్నాడు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల వరకు నమోదవుతుండగా, ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండ నుంచి రక్షణ కోసం క్యాప్‌లు, స్కార్ఫ్‌లు, చున్నీలు వంటివి ధరిస్తూ ఉపశమనం పొందుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్